ప్రజాశక్తి
ఆదివారం 28 డిసెంబర్ 2025 5 అనంతపురం



ఈవీఎం గోడౌన్లు తనిఖీ


గోడౌన్ తనిఖీ చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలు, లాక్ బుక్ లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ల వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవనాయుడు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉరవకొండలో జాతాలో పాల్గొన్న సిఐటియు నాయకులు

కార్మికుల 'మహా'స్వాగతం

- సిఐటియు జీపుజాతాకు అపూర్వ స్పందన
- అన్ని మండలాల్లో ఘనస్వాగతం పలికిన కార్మికులు
- జాతీయ మహాసభల విజయవంతం కోరుతూ మద్దతు
- రెపరెపలాడిన సిఐటియు జెండాలు

జిల్లాలో సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన జాపు జాతాకు కార్మికుల నుంచి మహా స్పందన లభించింది. విశాఖ పట్నంలో ఈ నెల 31, జనవరి 1,2,3,4వ తేదీల్లో జరగనున్న అఖిల భారత సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా శనివారం నాడు జిల్లాలోని పలు మండలాల్లో కొనసాగింది. ఉదయం ఉరవకొండ నుంచి ప్రారంభం అయిన జాతా కణేకల్లు, రాయదుర్గం, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, రాప్తాడులో పర్యటించి రాత్రికి అనంతపురం చేరుకుంది. జాతా పర్యటించిన ప్రాంతాల్లో సిఐటియు ఎర్రజెండాలు రెపరెపలాడాయి. 'హక్కులకు అండ.. సిఐటియు జెండా' అంటూ నినాదాలు హోరెత్తాయి. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆలపించిన గేయాలు కార్మికులను చైతన్యం చేశాయి. డప్పుల దరువులు ఉత్తేజ పరిచాయి. మహాసభల ఆవశ్యకతను తెలియజేస్తూ నాయకులు చేసిన ప్రసంగాలు కార్మికులను ఉత్తేజపరిచాయి. సిఐటియు 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా విశాఖపట్నంలో జనవరి 4వ తేదీన నిర్వహించే బహిరంగ సభలో తాము పాల్గొంటామంటూ కార్మికులు తెలియజేశారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిఐటియు అఖిలభారత మహాసభల విజయవంతం కోరుతూ చేపట్టిన జాతాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ కార్మికులను చైతన్యం చేసేలా జాతాలు కొనసాగాయి. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్‌తో పాటు జిల్లా, మండలా నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను సైతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసే దుర్మార్గపు నిర్ణయాలు చేస్తోందన్నారు. కార్మిక వ్యతిరేక నియంతృత్వ పోకడతో ప్రధాని నరేంద్ర మోడీ పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని కార్మికులు ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక బలాన్ని ప్రభుత్వాలకు చూపించాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నంలో జనవరి ఈ నెల 4వ తేదీన జరిగే సిఐటియు అఖిల భారత మహాసభల బహిరంగ సభలో కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని కార్మికుల సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

మిగతా 6లో మెయిన్‌లో

క్వాలిటీ 'కంట్రోల్'!





- మొక్కుబడిగా విత్తన, ఎరువుల నాణ్యత తనిఖీలు
- వ్యాపారులే శ్యాంపిల్స్ తెచ్చి ధ్రువీకరణలు
- కళ్లప్పగించి చూస్తున్న వ్యవసాయ శాఖ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతుకు నాణ్యమైన విత్తనం, ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చూడాల్సిన వ్యవసాయ శాఖలో క్వాలిటీ 'కంట్రోల్' వ్యాపారుల కంట్రోల్‌నే నడుస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు నిరంతరాయంగా తనిఖీలు నిర్వహించి లోపాలుంటే సరిదిద్ది అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు భిన్నంగా అధికారులు మొక్కుబడి తనిఖీలతోనే మమ అనిపించేస్తుండటం గమనార్హం. అది కూడా వ్యాపారులే శ్యాంపుల్లు తెచ్చి ధ్రువీకరణ పోయే పరిస్థితులున్నాయన్న విమర్శలూ ఉన్నాయి. ఒకవేళ ఎక్కడైనా పట్టుబడినా నామమాత్రపు చర్యలతోనే సరిచేసే చర్యలుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. అనంతపురం జిల్లాలో సుమారు 400కుపైగా ఎరువులు, పురుగు మందుల దుకాణాలున్నాయి. ఈ దుకాణాల్లో వస్తున్న స్టాకు, అమ్మకాలను ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించడంతోపాటు వాటి నాణ్యతను పరిశీలించాల్సి ఉంటుంది. సరైన నాణ్యతలేవని తేలితే అట్టి వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

నకిలీ పురుగు మందులు.. నాణ్యతలేని విత్తనాలు

నకిలీ పురుగు మందులు, నాణ్యతలేని విత్తనాలు విరివిగా అమ్మకాలు సాగుతున్నాయి. వీటిని వాడిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకుని ఉన్నాయి. ఇటీవలే అనంతపురం నగరంలో ఒక దుకాణంలో ఒక పెద్ద కంపెనీకి సంబంధించిన పురుగుల మందులే నకిలీవని తేలాయి. ఆ కంపెనీ ఇచ్చిన సమాచారం మేరకు అధికారులు పట్టుకున్నారు. కాని తరువాత విచారణ పేరుతో ఎటువంటి చర్యల్లేకుండానే వదిలేసారన్న ఆరోపణలున్నాయి. విత్తనాలైతే వేరే చెప్పనక్కర్లేదు కొన్ని నిషేధిత విత్తనాలు కూడా పెద్దఎత్తున మార్కెట్‌లో విక్రయాలు సాగుతూనే ఉన్నాయి. ప్రధానంగా పత్తితోపాటు, కాయగూరల విత్తనాలు నాసిరకమైన రైతులు తీవ్రంగా నష్టపోయినవి ఉంటుండటం గమనార్హం. అనంతపురం నగరంలోని బస్టాండ్ సమీపంలో ఒక దుకాణంలో ఉల్లి, టమోటా విత్తనాలు నాణ్యతలేకపోవడంతో రైతు పంటనష్టపోయాడు. రైతు ఫిర్యాదుతో ఈ దుకాణంలో తనిఖీలు నిర్వహించి తాత్కాలిక చర్యలతోనే నిలిపివేశారు.

అనుమతుల్లేకుండా ఎరువులు

అనుమతుల్లేకుండా ఎరువుల విక్రయాలు జరుగుతున్నవి వెలుగులోకి వచ్చాయి. గుత్తి రోడ్డులోని ఒక ఫర్టిలైజర్ షాపులో రాష్ట్రం నుంచి వచ్చిన ప్రత్యేక టీమ్‌లు వచ్చి అనుమతుల్లేకుండా నిలువున్న డ్రిమ్ ఎరువులను పట్టుకున్నారు. కాని జిల్లాలోని అధికారులకు మాత్రం ఇది కనిపించక పోవడం గమనార్హం. అంతకు మునుపు విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంటు శాఖ కూడా కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిలువలను గుర్తించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పెద్దఎత్తున ఎరువులు పక్క రాష్ట్రాలకు తరలిపోయాయన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఖరీఫ్, రబీ సాగు విస్తీర్ణం తక్కువగానున్న ఎరువుల విక్రయాలు అధికంగా జరిగాయి.

జిల్లా అధికారులు రిటైర్డ్ అవుతున్న నేపథ్యంలో..

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఈ నెలఖరుతో రిటైర్డు అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ అధికారి వీటిపై పెద్దగా దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. అప్పుడే ఇన్‌ఛార్జి బాధ్యతలను కూడా తాడిపత్రి ఎడిఎకి అప్పగించనున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన ఏ మేరకు ఇక్కడి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శికి అభినందనలు

ప్రజాశక్తి-కూడేరు

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థికశాఖ మంత్రి అయ్యావుల కేశవ్ ఆశీస్సులతో మూడోసారి టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గుండారపు శ్రీధర్ చౌదరికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండల పరిధిలోని ఇప్పేరు గ్రామ పంచాయతీలో ఉన్న శ్రీధర్‌చౌదరి స్వగృహంలో పలువురు టిడిపి నాయకులు చేరుకుని పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఇప్పేరు టిడిపి ఉపాధ్యక్షులు మల్లికార్జున, నాయకులు శ్రీనివాసులు నాయుడు, దేవా, ఆంజనేయులు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఏసీబీ, విజిలెన్స్ కేసులపై డీఎంఏ ఆరా

కార్పొరేషన్ ఉద్యోగుల్లో కలవరపాటు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఏసీబీ, విజిలెన్స్ పెండింగ్ కోర్టు కేసుల ఉద్యోగుల వివరాలపై మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ ఆరా తీస్తోంది. ఇటీవల అనంతపురం కార్పొరేషన్‌లో ఉద్యోగుల ఉద్యోగోన్నతుల వ్యవహారంలో చోటు చేసుకున్న అక్రమాలపై హైకోర్టు అక్షింతలు వేసిన విషయం తెలిసిందే. ఉద్యోగోన్నతుల్లో సీనియార్టీ జాబితాను రాజధానికి పంపిన ఉద్యోగుల వ్యవహార శైలిపై మున్సిపల్ ముఖ్య అధికారి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎక్కడా లేనివిధంగా అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగోన్నతుల విషయంలో సీనియార్టీ జాబితాను ఎందుకు పక్కన బెట్టారంటూ ప్రశ్నించారు. సర్వీస్ రూల్స్‌ను పక్కనపెట్టి అధికారులు వ్యవహరించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించినట్లు తెలిసింది. కార్పొరేషన్ స్థాయిలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించటం, దానికి డిప్యూటీ కమిషనర్లు డ్రాఫ్టింగ్ చేయటం, అందులోని లోపాలను గుర్తించకుండా కమిషనర్లు ఆమోదం ముద్ర వేయటంపై అసంతప్తి వ్యక్తం చేశారు. అనంత కార్పొరేషన్ కొందరు ఉద్యోగుల విషయంలో మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ అప్రమత్తమై ఎసిబి విజిలెన్స్ కోర్టు కేసు పెండింగ్‌లో ఉన్న వారి వివరాలను తయారుచేసి పంపాలని ఇక్కడి అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో అధికార యంత్రాంగం రికార్డులు పరిశీలించి ఎవరెవరిపై ఏసీబీ, విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న రికార్డులు పరిశీలించే పనిలో పడ్డారు. పెండింగ్ కోర్టు కేసులు సైతం తలనొప్పి వ్యవహారంగా మారింది. తుది విచారణ సమయంలో ఉన్నతాధికారులను సైతం కోర్టు ధిక్కరణ కేసుల్లో హాజరుకావాలని కోర్టులు సమన్లు పంపటం పరిపాటిగా మారింది. దీనికితోడు మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు సంబంధించిన సమాచారాన్ని అవినీతి నిరోధక శాఖ డిఎన్‌ఎ కార్యాలయం నుంచి సేకరించటంతో సమాచారం తెలుసుకున్న ఉద్యోగులు విజయవాడకు వెళ్లి ఉన్నతాధికారులను కలిసి వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్ట్ నుంచి శుక్రవారం నాడు ఏసీబీ విజిలెన్స్ పెండింగ్ కేసుల వివరాలను తక్షణం పంపాలంటూ ఆదేశాలు రావడంతో కార్పొరేషన్ అధికారులను కలవరపాటుకు గురి చేసింది. ఈ జాబితా తయారై రాష్ట్ర కేంద్రానికి వెళ్తే ఎవరిపై ఎలాంటి చర్యలు ఉంటాయో అన్న ఆందోళన అధికారుల్లో కన్పిస్తోంది.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

బంగారు, వెండి నగలు స్వాధీనం

ప్రజాశక్తి-అనంతపురం

మహిళల మెడలో బంగారు గొలుసులు, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అనంతపురం సిసిఎస్ పోలీసులతో కలసి త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 70 లక్షల విలువజేసే 400 గ్రాములు బంగారు ఆభరణాలు, ఏడు కిలోల వెండి, లక్ష రూపాయల నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కాన్ఫిరెన్స్ కార్యాలయంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావుతో కలిసి ఎస్పీ పి.జగదీష్ మీడియాకు వెల్లడించారు. కర్నాటక రాష్ట్రం బళ్లారి జిల్లా గుడార్ నగర్‌కు చెందిన యాదవల్లి మంజు, సిద్దరగడ్డకు చెందిన పిచ్చుగుంట్ల రామదాసులు స్నేహితులు. మద్యం, క్రికెట్ బెట్టింగ్, పేకాట, తదితర వ్యసనాలకు ఆలవాటుపడి అప్పులు చేశారు. ఈ అప్పులు తీర్చడానికి, వ్యసనాల కొనసాగింపు కోసం సులువుగా డబ్బులు సంపాదించాలని భావించారు. చైన్ స్నాచింగ్‌లు, బ్యాగ్ లిఫ్టింగులు, తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు చేయడం ప్రారంభించారు. శివారు ప్రాంతాలు, జన సంచారం లేని ప్రదేశాల్లో మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ వచ్చారు. అనంతపురం, తాడిపత్రి, గుత్తి, కసాపురం, డి.హీరేహాల్, బుక్కరాయసముద్రం ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. వీరిపై నిఘా ఉంచిన పోలీసులకు అందని సమాచారం మేరకు అనంతపురం నగరం బళ్లారి రోడ్డు సర్కిల్‌లో ఎంజి పెట్రోల్ బంకు వద్ద నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన అనంతపురం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్లు పి.శేషగిరి, జి.జయపాల్ రెడ్డి, ఆర్.రామయ్య, రాజశేఖర్ రెడ్డి, జి.రాజేంద్రనాథ్ యాదవ్ సిబ్బందిలను ఎస్పీ అభినందించారు.


స్వాధీనం చేసుకున్న బంగారు నగలను చూపుతున్న ఎస్పీ

అన్యాక్రాంతంకు అడ్డుకట్టలేదా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఈ వారంలో భూములు అన్యాక్రాంతమైన అంశాలు అధికంగా వెలుగులోకి వచ్చాయి. అనంతపురం నగరంలో శారద నగర్‌లో ఒక ఇంటిని కొందరు అక్రమార్కులు రిజిస్ట్రేషన్ చేసుకుని వారి బంధువులనే ఇంట్లోకి రాకుండా అడ్డుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఇదే కాకుండా నగరం చుట్టుపక్కలతోపాటు, గుత్తి తదితర ప్రాంతాల్లోనూ భూములు ఇతర పేర్ల మీద అన్యాక్రాంతమైనవి బయటకొచ్చాయి. ఇలా కనిపించిన భూమి అంతా రాత్రిరాత్రికి ఇతరుల పేరు మీదకు మారిపోవడమే కాకుండా డబుల్ రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. నిజమైన లబ్ధిదారులు ఎప్పుడో మేలుకుని లబోదిబో మంటు అధికారులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. దీనికంతటికీ అధికారపార్టీ నేతల అండదండలతోపాటు, కొంత మంది రెవెన్యూ రిజిస్ట్రేషన్ అధికారుల వల్లనే జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. వీటిపై మొక్కుబడి చర్యలుంటున్నప్పటికీ గట్టిగా నిర్ణయాలేవి ఉండటం లేదు. ఇదే రకంగా గతంలో అనంతపురం నగరంలోని పాపంపేటలో ఏకంగా వంద ఎకరాలకుపైగా భూమిని ప్రయివేటు వ్యక్తులకు జిపిఎ చేయించడం జరిగింది. దీనిపై పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన అధికారులు విఆర్‌ఓపై చర్యలు తీసుకున్నారు. అయితే ముఖ్యమైన అధికారుల అండదండల్లేకుండా ఇవి సాగే వ్యవహారం కాదన్న వాదనలున్నాయి. ముఖ్యమైన అధికారులపై ఇప్పటికీ ఎటువంటి చర్యల్లేకపోవడం గమనార్హం. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో అత్యధికంగా సమస్యలు వస్తున్నది రెవెన్యూపరమైనే ఉంటున్నాయి. దీనికంతటి కారణం అధికారుల అవినీతి కొంతైతే.. సిబ్బంది కొరత తీవ్రంగా రెవెన్యూలో కనిపిస్తుండటం గమనార్హం. జిల్లాలో సగానికిపైగా రెవెన్యూ పోస్టులు ఖాళీగానున్నాయి. ఇందులో ప్రధానంగా తహశీల్దారు పోస్టులే ఉన్నాయి. చాలాకాలంగా ఉద్యోగోన్నతుల పోస్టులు భర్తీ చేయలేదు. న్యాయపరమైన చిక్కుల కారణంగా ఇవి ఆగిపోయి ఉన్నాయి. దీంతో సరిపడనంత మంది అధికారుల్లేరు. ఉన్న వారికే ఇంఛార్జీలు ఎక్కువగా ఉంటున్నారు. పని ఒత్తిడి కొంత కారణమైతే, అవినీతి మరికొంత కారణమవుతోంది. వీటి ఫలితంగానూ తప్పిదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం దీనిపై చొరవ చూపి భర్తీలను పూర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటే చాలా వరకు పనిభారం తగ్గి తప్పిదాలను అరికట్టేందుకు వీలు కలిగే అవకాశముంటుంది.

తాడిపత్రి ప్రాంతంలో సుబ్బరాయసాగర్‌లో నీరున్నా గేటు పడిపోయిన కారణంగా పుట్లూరు మండలానికి నీరు వెళ్లే పరిస్థితి లేదు. ఇది సీజన్ ఆరంభంలోనే గేటు పడిపోయింది. దీని మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. ఇప్పుడు రాజకీయంగానూ స్పందనలు వస్తున్నాయి. శింగనమల వైసిపి నియోజకవర్గ



ఇన్‌ఛార్జి డాక్టర్ సాకే శైలజనాథ్ నీరు విడుదల చేయాలని కోరారు. అనంతరం తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి కూడా దీనిపై స్పందించారు. సుబ్బరాయసాగర్ ద్వారా పుట్లూరుకు నీరు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రాజెక్టును సందర్శించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని సాగునీటి అధికారులకు సూచనలు చేశారు.

రాజకీయంగా అధికారపార్టీలో కోలాహలం నెలకొంది. జిల్లా అధ్యక్షులు, పార్టీ పదవుల పంపకాలు రెండు జిల్లాల్లోనూ పూర్తి చేశారు. కొత్త నాయకత్వం ఉత్సహంతో పదవుల స్వీకరణ కార్యక్రమాల్లో ఉన్నారు.

సి.సుమంగళికి ఎస్‌కెయు డాక్టరేట్



ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యాపకురాలు సి.సుమంగళికి ఎస్‌కెయు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎస్‌కెయు వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కె.మద్దిలేటి ఆధ్వర్యంలో 'అనంతపురం జిల్లాలోని పాడి పరిశ్రమ ద్వారా మహిళా సాధికారత' అనే అంశంపై చేసిన పరిశోధనకు అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు సుమంగళికి అభినందనలు తెలిపారు.

రూ.30 కోట్లతో సీసీ, తారు రోడ్లు : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం నియోజకవర్గంలో ఏడాదిన్నర కాలంలో రూ.30కోట్ల నరేగా నిధులతో సిసి, తారురోడ్లు నిర్మించినట్లు విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. శనివారం రాయదుర్గం మండల పరిధిలోని రామకృష్ణ వద్ధాశ్రమంలో సీసీ రోడ్డు పనులకు విప్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగ పేరుతో ఉప ముఖ్యంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గతేడాది సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గంలో రూ.18.85 కోట్ల పనులను చేపట్టామన్నారు. పల్లెపండుగ-2 పేరుతో మరో రూ.8.35 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. తాజాగా రూ.2.70 కోట్లతో గ్రామాల్లో 74 పనులకు సంబంధించి సిమెంటు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఏడాదిన్నర కాలంలో రూ.30 కోట్ల సిసి, తారు రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారానే చేపట్టినట్లు వివరించారు. చంద్రబాబు ఆశీస్సులతో రానున్న మూడున్నరేళ్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇఇ సుధాకర్‌నాయక్, మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు సోము, రాజశేఖర్, వన్నూరుస్వామి, సదాశివరెడ్డి, నరేష్‌రెడ్డి, షమీవుల్లా, హనుమంతు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.


సిమెంట్ రోడ్డు కు భూమి పూజ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

9వ వార్డులో..

రాయదుర్గం : పట్టణంలోని తొమ్మిదవ ఎన్నికల వార్డులో సిమెంటు రోడ్డు నిర్మాణానికి విప్ కాలవ శ్రీనివాసులు శనివారం భూమిపూజ చేశారు. రూ.28 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఇంజినీర్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, 9వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి గౌరీ, టిడిపి పార్లమెంటు నియోజకవర్గ కోశాధికారి మహబూబ్‌బాషా, మున్సిపల్ వార్డు సభ్యురాలు ప్రశాంతి, టిడిపి పట్టణ మాజీ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు భారతి, కిరణ్, ఇనాయత్ భాష, వేణు, లోకేష్, తిప్పేస్వామి, రామాంజనేయులు, ధనర్జన, వెంకటేశులు, తిప్పయ్య, శివ, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జీపుజాతాకు విశేష స్పందన



కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం


బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టేందుకు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా శనివారం ఉరవకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ నుంచి జనవరి 4వతేదీ వరకు జరిగే అఖిల భారత మహాసభల్లో జిల్లాలోని కార్మిక, కర్షక, వ్యవసాయ, కార్మిక, రైతు, కౌలు రైతుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా కార్మికులపై బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. కార్మికుల హక్కులను కాలరాసి లేబర్ కోడ్లను రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ కూలీలకు అండగా ఉన్నటువంటి ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కొత్త చట్టాన్ని జి రాంజీ పేరుతో తీసుకురావడం చాలా దుర్మార్గమన్నారు. ఒకపక్క 125 రోజులు పని దినాలు పెంచుతున్నామని చెబుతూనే సంవత్సరంలో 60 రోజులు ఉపాధి పనులు నిషేధించారన్నారు. ఉపాధి కూలీలకు హక్కుగా ఉన్న చట్టాన్ని ఒక స్కీముల తీసుకొచ్చి భవిష్యత్తులో ఎప్పుడైనా ఎత్తేసే ప్రయత్నం చేస్తామన్నారు. ఆయా సమస్యలపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కావున ఉరవకొండ నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు రామాంజనేయులు, కోశాధికారి నాగమణి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ కౌలు రైతుసంఘం కార్యదర్శి ముష్టూరు వెంకటేశులు,రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు, హమాలీ యూనియన్ నాయకులు గోవిందు, గోపాల్, ఎం.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఈనెల 31వతేదీ నుంచి విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన జీపుజాతాకు విశేష స్పందన లభిస్తోంది. జాతా ఏ ప్రాంతానికి వెళ్లినా సిఐటియు నాయకులతోపాటు కార్మికులు అపూర్వ స్వాగతం పలుకుతున్నారు. ఈ సందర్భంగా రాయదుర్గంలోని వినాయక కూడలికి చేరుకున్న జీపుజాతా నాయకులకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని కూటమి ప్రభుత్వ పాలనలో కార్మికుల హక్కులను హరించే చట్టాలను తీసుకురావడం బాధాకరమన్నారు. పెట్టుబడుదారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. ప్రభుత్వం చేసిన కనీస వేతనాల చట్టాన్ని ప్రభుత్వమే అమలు చేయలేకపోతోందన్నారు. ఇందుకు ఉదాహరణ శ్రీరామిరెడ్డి రక్షిత తాగునీటి పథకం కార్మికుల ఆందోళనే అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం తోపాటు హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడే సిఐటియు మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్‌వి.నాయుడు, కోశాధికారి నాగమణి, సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, రామాంజనేయులు, ప్రజానాట్య మండలి కళాకారులు, సిపిఎం నాయకులు నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు రాధమ్మ, గోవిందమ్మ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

శెట్టూరు : విశాఖపట్నం జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన జాపుజాతా శనివారం కళ్యాణదుర్గానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, నాగేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ మాట్లాడుతూ సిఐటియు అఖిల భారత మహాసభలు రాష్ట్రంలో నిర్వహించడం రాష్ట్రానికే గర్వ కారణమన్నారు. మహాసభలకు కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయ సముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

రీసర్వేకు రైతులు సహకరించాలి

అవగాహన ర్యాలీల్లో తహాశీల్దార్లు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహాశీల్దార్ శ్రీధర్‌మూర్తి కోరారు. ఈమేరకు శనివారం మండలంలోని సిద్ధలాపురం, పసలూరు పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎంతో ఉపయోగంగా ఉండేందుకు ప్రభుత్వం భూముల రీసర్వే చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. రీ సర్వేలో భూములకు కొలతలు వేసి హద్దులు చూపించనున్నట్లు తెలిపారు. కావున రైతులు రీసర్వేకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహాశీల్దార్ గోపీనాథ్, వీఆర్వో శిల్ప, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : రీ-సర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని రావులోడికి, కండ్లగూడూరు, వీరన్నపల్లి గ్రామాల్లో శనివారం రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసిన రీ సర్వే వల్ల కలిగే ఫలితాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల రీ సర్వే డిప్యూటీ తహాశీల్దార్ జయమ్మ, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వోలు, సర్పంచులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని బూదిగుమ్మ, రామసాగరం, అంకంపల్లి, కాలువపల్లి గ్రామాల్లో శనివారం రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ పి.అనిల్‌కుమార్ రీసర్వే ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ బి.అనిల్‌కుమార్, రీసర్వే డిప్యూటీ తహాశీల్దార్ గురుబ్రహ్మ, విఆర్ఒ మధుసూదన్, సర్వేయర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు పై అవకాశాలు, పరిమితులపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వి. రఘునాథరెడ్డి రోబోటిక్స్, ఎఐ సాంకేతికతలు భవిష్యత్తులో విద్య, పరిశ్రమలు, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామన్నారు. అయితే నైతిక విలువలు, ఉద్యోగాలపై ప్రభావం వంటి పరిమితులను కూడా సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి మాట్లాడుతూ వైద్యరంగంలో ఎఐ, రోబోటిక్స్ నిర్ధారణ, శస్త్రచికిత్సలు, ఔషధ పరిశోధన, రోగి సంరక్షణలో విస్తృతంగా ఉపయోగపడుతున్నా యన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్సలు అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించడంతోపాటు రోగులు కోలుకునే సమయాన్ని తగ్గిస్తున్నాయన్నారు. ఇలాంటి అకడమిక్ కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఆలోచనలను పెంపొందిస్తాయన్నారు. గౌరవ అతిథి కుప్పాల సరిత మాట్లాడుతూ డేటా గోప్యత, నిఘా వ్యవస్థలు, పాక్షికత వంటి నైతిక సమస్యలు ఎఐ వినియోగంలో ఎదురవుతున్నాయని కనుక విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. కీనోట్ స్పీకర్ ఎన్.ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ రోబోటిక్స్, ఎఐ పరిశ్రమల రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. స్వయంచాలక యంత్రాలు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, మానవ తప్పిదాలను తగ్గించవచ్చన్నారు. అంతేగాకుండా నాణ్యత నియంత్రణ, నిర్వహణ అంచనాలు, సరఫరా వ్యవస్థలను మెరుగు పరచడంలో ఐ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కీనోట్ స్పీకర్ కె. నటరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి.ప్రసాద్, కళాశాల ఎఒ ఎ.శ్రీనాథ్, కోఆర్డినేటర్ ఎన్.లావణ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.విక్రమ్, ఆర్గనైజింగ్ కమిటీ సి.దివ్యశ్రీ, సి.శ్వేత, బి.జాహ్నవి, కె.సానియాకౌసర్ పి.రామకృష్ణయ్య, ఎం.శివశంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

మత్స్యకారుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, చేపల ఉత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం గుమ్మఘట్ట మండలం భైరవాణితిప్ప ప్రాజెక్టు రిజర్వాయర్‌లో 10.40 లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విప్ మాట్లాడుతూ ఈఏడాది రాష్ట్రవ్యాప్తంగా అనేక జలాశయాలు నీటితో కలకలాడుతున్నాయన్నారు. దీంతో చేపల పెంపకం ఆశాజనకంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. సిఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడులు మత్స్యకారులకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందించడంలో ఎప్పుడు సిద్ధంగా ఉంటారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్న ముఖ్యమంత్రి రాయదుర్గం నియోజకవర్గానికి సాయం చేయడంలో ముందున్నట్లు చెప్పారు. భైరవాణితిప్ప ప్రాజెక్టులో సాధారణంగా 6.40 లక్షల చేప పిల్లలను వదులుతుండగా ఈఏడాది 10.40 లక్షల పిల్లలను వదిలినట్లు వివరించారు. వివిధ కారణాలవల్ల కొన్ని చేప పిల్లలు మధ్యలో చనిపోయిన, వలలకు చిక్కకపోయినా కనీసం 50 శాతం చేపలను పట్టుకోవడానికి వీలవుతుందన్నారు. దానివల్ల ఈ ఏడాది సుమారు రూ.26 కోట్ల విలువజేసే మత్స్య సంపద అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో చేపలు పట్టుకోవడానికి మత్స్యకారుల సంఖ్య కూడా పెరగాలన్నారు. ప్రాజెక్టుకు 8 కిలోమీటర్ల పరిధిలో ఉంటూ ఆసక్తి ఉన్న మత్సకారులు తమ పేర్లను ముందుగానే రిజిస్టర్ చేసుకోవచ్చుని, లైసెన్సులు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏడాది ఉన్న సానుకూల పరిస్థితులను ఉపయోగించుకుని అధిక లాభాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కాలవ సన్నన్న, రమేష్, చిన్నికృష్ణ, మూర్తి, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



చేప పిల్లలను వదులుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

లూయిపాశ్చర్‌కు నివాళి

ప్రజాశక్తి-శెట్టూరు

టీకాలు, వ్యాక్సిన్‌ను కనుగొన్న లూయిపాశ్చర్ జయంతిని పురస్కరించుకుని శనివారం దొడ్డగట్ట ప్రాథమిక పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ మాట్లాడుతూ నిర్ధారించిన సమయంలో టీకాలు, వ్యాక్సిన్స్ తీసుకోవడం ద్వారా వ్యాధులను నిర్మూలించవచ్చని కనుగొన్న లూయిపాశ్చర్ సేవలు మరువలేనివన్నారు. మనదేశంలో శాస్త్రవేత్తలు తయారు కావాలంటే చిన్నప్పటి నుంచే శాస్త్రీయజ్ఞానం పెంచుకోవాలన్నారు. రేబిస్ వ్యాధితో మరణించిన జీవిని పూర్తిగా దహనం చేయాలన్నారు. పులియబెట్టు విధానం (పాశ్చరైజేషన్), కిణ్వణం (ఫెర్మెంటేషన్), రేబిస్, ఆంత్రాక్స్ వంటి భయంకరమైన వ్యాధులకు టీకాలు తయారు చేసి ఆదర్శ శాస్త్రవేత్తగా నిలిచారని కొనియాడు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల వెంకటేశులు, చంద్రశేఖర్‌రెడ్డి, రాజన్న, రమేష్, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ ప్రసాద్‌బాబు, డివైయు మల్లారెడ్డి, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్)-2026 డైరీ, క్యాలెండర్‌ను డిఇఒ ప్రసాద్‌బాబు, డివైయు మల్లారెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ ఉద్యమాలకు దిక్సూచిగా పనిచేస్తున్న యుటిఎఫ్ రాబోయే సంవత్సరానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులకు సక్రమంగా సమాచారాన్ని ఇవ్వడానికి, వారు చేపట్టబోయే ఉద్యమాలు, ఉపాధ్యాయుల హక్కుల్ని కాపాడే బాధ్యతను ప్రతి ఉపాధ్యాయుడు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటేశ్వరప్ప, ఈశ్వరయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా సహాధ్యక్షులు సరళ, జిల్లా కార్యదర్శులు అర్జున్, సుబ్బరాయుడు, చంద్రమోహన్, రాష్ట్ర కౌన్సిలర్లు లింగమయ్య, గోవిందరాజులు, ఆడిట్ కమిటీ కన్వీనర్ గంగాధర్, సీనియర్ నాయకులు నాగేంద్ర, వివిధ మండలాల నాయకులు వీరాచారి మహమ్మద్‌గౌస్, రామాంజనేయులు, ముసలప్ప, మల్లికార్జున, మనోహర్, సంపత్‌కుమార్, ఓబుళపతి, కొండప్ప, శివానంద, శ్రీనివాసులు, అనసూయ, తిమ్మప్ప, శేషు, శ్రీనివాసులు, మంజునాథ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలాఫెర్రర్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలఫెర్రర్

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రతి మహిళ సొంత తెలివితేటలతో ఆర్థికంగా ఎదగాలన్నదే ఆర్డీటీ లక్ష్యమని ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలాఫెర్రర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మి మహిళా కోఆపరేటర్ బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుందుర్పి మండల ఏరియాలో ఉన్న మహిళా సంఘం సభ్యులు సొంత నిధులతో కోపరేటివ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. మొత్తం 36 గ్రామాల్లో 245 సంఘాలు, 2480 మంది సభ్యులు ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. ఈ సభ్యలంతా రూ.రూ.42,30,815 పోగు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఏదో రూపంలో ఆర్డీసీ సంస్థ మహిళలను లక్షాధికారులు చేయడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్ నిర్మల, ఆర్డీ సుబ్బారావు, ఆర్‌వై డిటి రామాంజనేయులు, వెంకటేశులు, మహిళా విభాగం, ఎపిసి సురేష్, సిఇఒలు రవి, భాగ్య, నంద, పుల్లమ్మ, ఎకాలజీ లక్ష్మీకాంత్, ఎం.నారాయణస్వామి, పేటీఎం నాగభూషణ, 36 గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఈశ్వర్

గుత్తి : మండలంలోని గాజులపల్లి గ్రామంలో సిసి రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు, టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఇఇ డిఎల్.మురళీధర్, ఎంపిడిఒ డి.ప్రభాకర్, ఎఇఇ మల్లేష్‌నాయక్, ఎంపిటిసి జింకల నారాయణస్వామి, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మీరంగయ్య, పల్లా సాంబశివయాదవ్, నాయకులు ఎస్.కిట్టుయాదవ్, రామచంద్ర, వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన


ప్రజాశక్తి-శింగనమల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం మండల కేంద్రంలోని చెరువు కట్ట కింద వరినాట్లు వేసే రైతులతో మాట్లాడనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ మారుతీనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని శివాలయం పరిసర ప్రాంతాల్లో ఉన్న పొలాలు, వరినాట్లు నాటే రైతులను కలుసుకుని సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కావున కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మహిళల వృద్ధాశ్రమం ప్రారంభం

ప్రజాశక్తి-శెట్టూరు

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని దడగట్ట రోడ్డులో ఏర్పాటు చేసిన మహిళల వృద్ధాశ్రమాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తలారి గౌతమి సోమశేఖర్, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి రమేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధాశ్రమాన్ని ప్రారంభించడం కొంచెం సంతోషంగా, కొంచం బాధగా ఉందన్నారు. తల్లిదండ్రులు, పిల్లలను వృద్ధాశ్రమాలకు పంపడం మన సంస్కృతి, సంప్రదాయం కాదన్నారు. అయితే అనాథలుగా మారే తల్లిదండ్రులు, పిలల్లలకు ఇలాంటి ఆశ్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.



నిర్వాహకులను సన్మానిస్తున్న దృశ్యం

సుందర 'అనంత'కు కృషి : ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. శనివారం నగరంలోని ఉమానగర్‌లో ఫుట్‌పాత్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మల్లాలమ్మ గుడి నుంచి త్రివేణి టాకీస్ బ్రిడ్జ్ వరకూ ఫుట్‌పాత్ నిర్మాణానికి రూ.8.30లక్షలు మంజూరయ్యాయి. దీంతో ఆయా పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ రోజురోజుకీ పెరుగుతోందన్నారు. ఈక్రమంలో ప్రతిమార్గంలో ఫుట్‌పాత్‌ల అవసరం చాలా ఉందన్నారు. అందుకే వీటి నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, డివైడర్ల మధ్య మొక్కల పెంపకం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మార్కెట్ యార్డు ఛైర్మన్ బల్లా పల్లవి, టిడిపి నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ఉపాధ్యాయులకు పెరిగిన బాధ్యత

ప్రధానోపాధ్యాయురాలు జివ్విమాను సిద్ధమ్మ





ప్రజాశక్తి-అనంతపురం సిటీ

గతంతో పోలిస్తే ప్రస్తుత ఉపాధ్యాయులకు బాధ్యత పెరిగిందని నగరలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జివ్విమాను సిద్ధమ్మ తెలిపారు. ఈనెల 31వతేదీన పదవీ విరమణ సందర్భంగా సందర్భంగా ప్రజాశక్తితో సిద్ధమ్మ మాట్లాడుతూ పిల్లలకు విద్యాబోధనతోపాటు స్పోర్ట్స్ కిట్ ఇచ్చి ఆటల పాటలు నేర్పించడం, పద్యాలు పాడించడం, లైబ్రరీలో పుస్తకాలు చదివించడం, బొమ్మలు వేయించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రకార్యక్రమం కింద ప్రతినెలా 3వ శనివారం నోబ్యాగ్ డే అని శుభ్రంగా రావాలని నేర్పించటంతోపాటు పాఠశాల ఆవరణ, పరిసరాలను ఎలా శుభ్రంగా ఉంచుకోవాలో వివరిస్తున్నామన్నారు. వీటితోపాటు మగ, ఆడపిల్లలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, స్వచ్ఛనీరు ప్లాంట్లు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. రెండు టీవీ క్లాస్ రూమ్‌లో ఏర్పాటు చేసి డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 16వ తేదీన ప్రభుత్వం చేపట్టిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ పేరెంట్స్ టీచర్స్ పేరుతో పిల్లలు ఒకే చోట సమావేశమై ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తున్నామన్నారు. అంతేగాకుండా ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారనే విషయాలపై చర్చించుకుంటున్నట్లు తెలిపారు. పిల్లల హాజరు పట్టిక దగ్గర నుంచి విద్యార్థులు రాసే ఫార్మేటివ్ అసెస్మెంట్లు, సమ్మేటివ్ అసెస్మెంట్లలో వారికి వచ్చిన మార్కులతో ప్రతి విద్యార్థికీ హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు తయారు చేసి వారికి పర్మనెంట్ ఎడ్యుకేషన్ సంఖ్య కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ నివేదిక అంతా ఆన్‌లైన్ ద్వారా విద్యాశాఖ చీఫ్ సెక్రటరీకి వెళ్తుందన్నారు. తద్వారా పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి సమాచారం కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకూ తెలుస్తుందన్నారు. ఆయా కార్యక్రమాలతో ఉపాధ్యాయుల బాధ్యత బాగా పెరిగిందన్నారు. ప్రతి విద్యార్థికీ పుస్తకాల బ్యాగుతోపాటు యూనిఫామ్, బెల్టు, బూట్లను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తోందన్నారు. మధ్యాహ్నం భోజనంలో కూడా సోనా మసూరిబియ్యంతో వండిన అన్నమే వడ్డిస్తున్నామన్నారు. భోజనంతోపాటు గుడ్లు, చిక్కీలు ఇస్తున్నామన్నారు. ప్రయివేటు పాఠశాలలతో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి సదుపాయాలతోపాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. ఇకపోతే 1981లో తాను ఇంటర్ పూర్తి చేసి 1982లో చిత్తూరు జిల్లాలో టిటిసి చదివినట్లు తెలిపారు. 83లో మొదటిసారి కదిరి మండలంలోని కటారిపల్లిలోని ప్రైమరీ స్కూల్లో ఉపాధ్యాయునిగా చేరానన్నారు. తర్వాత 1985 జనవరి 7న నగరంలోని ప్రభాకర్ జి మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌కు బదిలీపై వచ్చానన్నారు. అక్కడి నుంచి పలు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ ఈనెల 31న పదవీ విరమణ పొందుతున్నట్టు తెలిపారు. తన భర్త బండి ఆదినారాయణ ఐసిడిఎస్ శాఖలో టైపిస్ట్‌గా పని చేసి 2019 ఆగస్టులో కూడేరు మండలం కేంద్రంలో పని చేస్తూ పదవీ విరమణ పొందారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ముగ్గురికి గాయాలు
పోతుదొడ్డి వద్ద ఘటన

ప్రజాశక్తి-గుత్తి

జిల్లా సరిహద్దులోని పోతుదొడ్డి గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామానికి చెందిన పలువురు నంద్యాల జిల్లా ప్యాపిలికి ఈనెల 25వ తేదీన జరిగిన క్రిస్మస్ పండుగకు బంధువుల ఇళ్లకు వెళ్లారు. తిరిగి శనివారం ఆటోలో స్వగ్రామానికి వస్తుండగా పోతుదొడ్డి వద్ద వస్తున్న ఆటోను వెనక వైపున వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాజేష్ (32), అతని భార్య కళావతి, కుమార్తె వర్ష, నవీన్ (23), స్వీటీ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాజేష్ మృతి చెందాడు. నవీన్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. రాజేష్, నవీన్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.





మృతిచెందిన నవీన్, రాజేష్

మిడుతూరులో విషాదఛాయలు

పెద్దవడుగూరు : నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతుదోడ్డి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం మండలంలోని మిడుతూరుకు చెందిన ఇద్దరు మృతిచెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ఆటో డ్రైవరు రాజేష్ తన భార్య కళావతి, వర్షతో కలసి క్రిస్మస్ వేడుకల నిమిత్తం ప్యాపిలికి వచ్చారు. అక్కడ పండుగ చూసుకొని తిరుగు ప్రయాణమై వెళ్తున్న సమయంలో అదేగ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తి అత్తగారి ఊరైన ప్యాపిలి మండలం రాళ్లపాడుకు భార్య స్వీటీతో కలిసి వెళ్లి వస్తూ ప్యాపిలిలో సొంత గ్రామస్థులు రాజేష్ ఆటో నడుపుతూ కనిపించడంతో రెండు కుటుంబాలు సొంత గ్రామం మిడుతూరుకు పయనమయ్యారు. ఈ తరుణంలో పోతుదొడ్డి వద్దకు రాగానే కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వీరు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం గుత్తికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఆయా కుటుంబాల సభ్యులు ఆసుపత్రికి చేరుకుని విలపించారు. బాధితుల ఆర్తనాదాలతో ఆసుపత్రి ఆవరణ మిన్నంటింది. మృతులు రాజేష్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. నవీనక్ పిల్లలు లేరు. ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆటోను ఢీకొన్న కారును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.


టిడిపి పార్లమెంటరీ సెక్రటరీ షామీర్‌ను అభినందిస్తున్న ముస్లిములు

టిడిపి పార్లమెంటరీ సెక్రటరీ షామీర్‌కు సన్మానం

ప్రజాశక్తి-శెట్టూరు

టిడిపి పార్లమెంట్ సెక్రటరీ కొలిమి షామీర్‌ను శనివారం స్వగృహంలో నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శెట్టూరు ముస్లిం మైనారిటీ మైనార్టీ మత పెద్దలు మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గం చరిత్రలో ముస్లిములకు టిడిపి పదవుల్లో జిల్లాస్థాయి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముస్లిములకు సముచిత స్థానం కల్పించడం గర్వకారణమన్నారు. షామీర్ మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చినందుకు టిడిపి అధినేత చంద్రబాబు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంతోపాటు పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గురుబి, మాజీ ఎంపిపి చిత్తప్పబి, శెట్టూరు మండలం ముస్లిముల కార్యనిర్వాహక (ఖాజీ) నసీర్‌సాబ్, మండల ముస్లిం మైనార్టీ పెద్దలు అమీర్ సాబ్, షాజహాన్, సద్దాం, మునీర్, ఇబ్రహీం, రసూల్, షరీఫ్, ఇమ్రాన్‌ఖాన్, జావీద్, యాటకల్ కరీంసాబ్, కళ్యాణదుర్గం మండలం మోతికాపురం ఇమాంవలి, తదితరులు పాల్గొన్నారు.

'సుబ్బరాయసాగర్'ను పూర్తిగా నింపుతాం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు మండలంలోని సుబ్బరాయ సాగర్‌ను పూర్తిస్థాయిలో నీటితో నింపుతామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. అమేరకు శనివారం నార్పల మండలం దయ్యాలకుంటపల్లి వద్ద ఉన్న హెచ్చెల్సీ 20వ డిస్ట్రిబ్యూటరీ వద్దకు ఎమ్మెల్యే చేరుకుని స్వయంగా నీటి ప్రవాహ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని సుబ్బరాయ సాగర్‌ను నీటితో నింపడంతోపాటు అక్కడి నుంచి పుట్లూరు, కోమటికుంట్ల, గరువు చింతలపల్లి చెరువులు, అలాగే 29వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా బొప్పేపల్లి చెరువుకు నీటిని అందిస్తామన్నారు. సుబ్బరాయ సాగర్‌కు నీటి సరఫరా సజావుగా జరిగేందుకు మిగిలిన అన్ని డిస్ట్రిబ్యూటరీల వద్ద ప్రస్తుతం నీటి ప్రవాహాన్ని సమతుల్యం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారన్నారు. ఈ విషయాన్ని రైతులందరూ గమనించి సహకరించాలని కోరారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని తరిమెల గ్రామంలో కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డిఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా అయ్యప్పస్వామి విగ్రహానికి అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో ప్రత్యేక అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి రామ మందిరం నుంచి పురవీధుల గుండా డప్పు వాయిద్యాల మధ్య అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవానికి వచ్చిన అయ్యప్ప స్వాములకు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు చిన్నయ్య, హరి స్వాములు, మహిళలు, పుర ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్పస్వామి మాలధారులు

ప్రజాశక్తి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరాపురం

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం సింగిల్‌విండో అధ్యక్షులు గణేష్ ప్రజాశక్తి-2026 కోర్ట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక నిరంతరం ప్రజల పక్షాన పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ధనుంజయ, టిఎన్‌టియుసి కార్యదర్శి మంజన్న, దివాకర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ గిరీష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎపిఒ శివన్న, ఎపిఎం ముత్యాలప్ప ప్రజాశక్తి-2026 కోర్ట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రజలు, అధికారులు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తుందన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను లేవనెత్తుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు సుజాతమ్మ, వరలక్ష్మి, సీసీలు నాగరాజురెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏ వర్గానికీ వ్యతిరేకం కాదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

దాతల సహకారంతో వాహనాలు సమకూర్చామని, ఏ వర్గానికీ వ్యతిరేకం కాదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. కదిరి పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో శనివారం ఎమ్మెల్యే మీడియా సమావేశంలో మాట్లాడారు. కదిరి నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు దాతల సహకారంతో వాహనాలు సమకూర్చామని తెలిపారు. ఆ వాహనాలను పోలీస్ శాఖకు అప్పగించే సందర్భంగా స్థానిక ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి గుడి ఆవరణలో పూజలు చేసి, తర్వాత గుడి బయట సర్వమత ప్రార్థనలు చేయించి అప్పజెప్పాలనే ఆలోచనతోనే కార్యక్రమం చేశామన్నారు. మంచి ఆలోచనతో చేసిన ఈ కార్యక్రమాల్ని అపార్థం చేసుకోవద్దని కోరారు. వాహనాల విషయంలో రాజకీయం చేయాలనే ఆలోచన లేదన్నారు. కొందరు ఈ మధ్యకాలంలో సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ఆలోచనలు, వ్యాఖ్యలకు ముగింపు పలకాలని ప్రెస్‌మీట్ పెట్టానన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

వికలాంగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వికలాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై శనివారం రాష్ట్ర దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షఫీ ఆధ్వర్యంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ గోగుల చక్రపాణి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు కేటాయించిన సీట్లలో వారిని కూర్చునే విధంగా ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వెళ్లే వికలాంగులకు అనుకూలంగా ర్యాంపు ఏర్పాటు చేయాలని, వికలాంగులపై దాడులు జరిగినప్పుడు పోలీసులు 2016 వికలాంగుల హక్కుల చట్టం తప్పకుండా అమలు చేయడంతో పాటు న్యాయం చేసేలా పోలీస్ శాఖ ఆదేశాలు జారీ చేయాలని, తదితర సమస్యలను ఏకరువు పెట్టారు. వినతి ఇచ్చిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజి, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, వీరేష్, ధనుంజయ, ఈశ్వరప్ప, రామచంద్రారెడ్డి, గజేంద్ర, నాయకులు, వికలాంగులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈమేరకు శనివారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో అర్బన్ నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు మంజూరైన సెల్‌ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీలు పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వారు విశేషమైన సేవలందిస్తున్నారన్నారు. ఈ వ్యవస్థను గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో బలోపేతం చేశారన్నారు. రెండుసార్లు వారికి వేతనాలు కూడా పెంచారన్నారు. ఇప్పుడు వారు మరింత మెరుగైన సేవలు అందించే విధంగా సెల్‌ఫోన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. గతంలో లాగా ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ ఫోన్ ద్వారా అప్‌డేట్ చేసే విధంగా వ్యవస్థను ఈ ప్రభుత్వం మరింత బలోపేతం చేసిందన్నారు. గతంలో అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్డెక్కితే.. వారిని ఉద్యోగాల నుంచి తొలగించే కుట్రలు చేశారన్నారు. మహిళలు అని కూడా చూడకుండా అవమానించారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ బల్లా పల్లవి, డైరెక్టర్లు పోతుల నరసింహులు, పరమేశ్వర్, బొమ్మినేని శివ, కార్పొరేటర్ జనబలం బాబా, క్లస్టర్లు శ్రీధర్, ఫిరోజ్ అహ్మద్, వన్నూరు, కేశవనాయుడు, టిడిపి నాయకులు సుధాకర్‌నాయుడు, సుధాకర్‌యాదవ్, నెట్టెం బాలకృష్ణ, వడ్డే భవాని, నాయుడమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.


అంగన్వాడీలతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

జిల్లాస్థాయి పోటీల్లో 'అనంతలక్ష్మి' ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

హిందూపురం పట్టణ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి షాట్‌పుట్ క్రీడల పోటీలో అనంతలక్ష్మి కళాశాలకు చెందిన ఎంఎస్‌కె.చాందిని అత్యంత ప్రతిభ కనబరిచింది. అనంతలక్ష్మి కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న చాందిని ప్రథమ బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. దీనికితోడు డిస్క్ క్రీడల పోటీలో ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ కుటాల శ్రీనివాసులు తెలిపారు. అలాగే అనంతపురం పట్టణ డిప్లొమా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జోనల్ స్థాయి క్రీడల్లో అనంతలక్ష్మి కళాశాలలో తృతీయ సంవత్సరం డిప్లొమా చదువుతున్న విద్యార్థులు బాలుర బాల్ బ్యాడ్మిటన్ పోటీల్లో తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ అనంత రాముడు మాట్లాడుతూ ఐపిఎస్‌జిఎం 2025-26 జిల్లాస్థాయి పోటీల్లో కళాశాల డిప్లొమా విద్యార్థులు పాల్గొని మొదటి, ద్వితీయ తృతీయ బహుమతులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఆయా విద్యార్థులను ఛైర్మన్‌తోపాటు వైస్‌ఛైర్మన్ ఎ.రమేష్‌నాయుడు, ప్రిన్సిపాల్ కుటాల శ్రీనివాసులు, డిప్లొమా ఇన్‌ఛార్జి పురుషోత్తం, హరినాథ్, ఫిజికల్ డైరెక్టర్లు మల్లికార్జున, కుమారి ధనలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న అనంతలక్ష్మి యాజమాన్యం

మండలస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం

తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఇక నుంచి ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించనున్నట్లు తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భూ సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో సమస్యను పరిష్కరించే విధంగా అన్నిశాఖల అధికారులు పాల్గొంటారన్నారు. కనుక అర్జీదారులు ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పట్టాదారు పాస్ పుస్తకం, ఇంటి పట్టాలు, భూముల సర్వే, రీ-సర్వే సమస్యలు, పక్కా ఇళ్ల నిర్మాణం, తదితర రెవెన్యూ, ఇతర సమస్యలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, హౌసింగ్, ఉపాధి హామీ, విద్యుత్, పండ్ల తోటల పెంపకం, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసిడిఎస్ పాడి పరిశ్రమ, తదితర శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. కావున ప్రజలు సమస్యలు ఏవైనా ఇక్కడే ఇచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.



కౌన్సిలర్లను గుర్తించండి

కౌన్సిల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్ల అభ్యర్థన

ప్రజాశక్తి-పెనుకొండ

'కౌన్సిలర్లుగా గుర్తించండి.. వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కా రంలో తమను భాగస్వాము లను చేయండి' అని కౌన్సిల్ సమావేశంలో పలు వురు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అభ్యర్థించారు. పట్టణంలోని నగర పంచాయతీ సమావేశ భవనంలో శనివారం ఛైర్మన్ ఉమర్ ఫరూక్ అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను ప్రవేశపెట్టగా కౌన్సిలర్లందరూ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామాంజనేయులు, సద్దాం, శేషాద్రి, తదితరులు వార్డుల్లోని సమస్యలను ఏకరువు పెట్టారు. నగర పంచాయతీ పరిధిలోని వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. తమ వార్డుల్లో చేస్తున్న పనులను తమకు తెలియకుండానే అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో చేపడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన తమకు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో భాగస్వాములు చేయాలని కోరారు. మేము చెప్పిన పనులను అధికారులు పెడచెవిన పెడుతున్నారని, సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. వార్డ్ పరిధిలో కనీసం వీధిలైట్లు వేయించుకోలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికి తాము ఆటంకం కలిగించమని, అభివృద్ధిలో తమను కూడా భాగస్వాములు చేయాలని వారు కమిషనర్‌ను కోరారు. కౌన్సిలర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో పూల దుకాణాల కారణంగా ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని తెలిపారు. పూల మార్కెట్‌ను నిర్మించి చాలా రోజులు అయిందని పూలు అమ్ము కునే వారిని మార్కెట్‌కు తరలిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. ఎన్టీఆర్ కాలనీ, జగనన్న కాలనీల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఛైర్మన్ మాట్లాడుతూ కౌన్సిలర్లు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. ఆయా వార్డుల పరిధిలో చేపట్టే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను కౌన్సిలర్లకు తెలపాలని సూచించారు. సభ్యులు సూచించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. సమావేశంలో కమిషనర్ సతీష్ కుమార్, వైస్‌ఛైర్మన్ సునీల్‌కుమార్, మున్సిపల్ అధికారులు వెంకటరమణ, రామ్మోహన్, కౌన్సిలర్లు గిరి, తయూబ్, భాస్కర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ ఉమర్‌ఫరూక్


భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి తహశీల్దార్

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాలాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని లోచర్ల ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు కూరలు, భోజనం రుచిగా శుభ్రంగా అందించాల న్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలన్నారు. అనంతరం పొలాల్లో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న భూ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే పోతులకుంట గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు : ఏవో

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రైతులకు ఎరువులు, విత్తనాలు, మందులు, తదితర వాటిని అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని పి.కొత్తపల్లి, పెడబల్లి, ధనియాన్‌చెరువు, మేకలచెరువులో నిర్వహిస్తున్న ఫర్టిలైజర్ షాపులను శనివారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు పంటలకు అధిక మోతాదులో యూరియా వాడరాదని సూచించారు. రైతు సేవా కేంద్రాల వద్ద సూచిక బోర్డులో ఎరువులు, నిర్ణీత ధరలు ప్రదర్శించాలన్నారు. ప్రతిరోజూ సాయంత్రం వ్యవసాయ కార్యాలయానికి ఎరువుల సమాచారం పంపాలని ఆదేశించారు.

వ్యక్తి మృతికి నివాళి

ప్రజాశక్తి-యల్లనూరు

పక్షవాతంతో మృతిచెందిన మండల కేంద్రంలోని పాతపేట శివారులో నివాసం ఉంటున్న డి.వెంకటేష్ (65) మృతికి వైసిపి నాయకులు శనివారం మృతిచెందారు. వెంకటేష్ కొంతకాలంగా పక్షవాతం వ్యాధితో బాధపడేవాడు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగతి విజయ్ ప్రతాప్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అన్నదానం

శింగనమల : రుషి శృంగమహాముని, శ్రీరంగరాయుల జ్ఞాపకార్థం మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ యాదవ్ మాట్లాడుతూ స్వామి భక్తుల సహకారంతో 26వ శనివారం అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాయల ప్రకాష్, రుషింగమయ్య, కురుబ వీరన్న, రవియాదవ్, వాల్మీకి పుల్లయ్య నల్లప్ప, పవన్, ఆదెన్న, శీనా, నారాయణస్వామి, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

మహిళలను లక్షాధికారులను చేయడమే సిఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శనివారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్‌విఇపి (స్టార్టప్ విలేజ్ ఎంటర్ ప్రెన్యూర్) కార్యక్రమంపై వెలుగు సిబ్బంది, ప్రాజెక్ట్ డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఒక ఎంటర్ ప్రెన్యూర్ ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. ప్రతి ఒక్క సీఆర్పీ తమ గ్రామంలో ఔత్సాహికులైన ఎంటర్ ప్రెన్యూర్‌లను గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ఏర్పాటు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రానికి చెందిన పుల్లారెడ్డి నీటి ట్యాంకును ఉచితంగా బించారు. మండల కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించేందుకు పుల్లారెడ్డి నాలుగు నెలల క్రితం కోటవీధిలో బోరు వేసిన విషయం తెలిసిందే. అప్పట్లో కోట వీధిలో 1500 లీటర్ల నీటి ట్యాంకును ఉచితంగా ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో శనివారం కూడా సొంత డబ్బులు రూ.30 వేలు వెచ్చించి పైపులైను ద్వారా పాత సచివాలయం వద్ద 2000 లీటర్ల ట్యాంకు ఏర్పాటు చేసిన తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రజలు పుల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.




తాగునీటి ట్యాంకు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

పుట్లూరు : ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ సిఐ సత్తిబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేఖరి చంద్రశేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐ

తరిమెల శరత్ చంద్రారెడ్డికి నివాళి



ప్రజాశక్తి-శింగనమల

దివంగత వైసిపి నాయకులు తరిమెల శరత్ చంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తరిమెలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్రారెడ్డి కుమారుడు, వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రికి రైతులన్నా, రాయలసీమ ప్రాంతమన్నా ఎంతో ఇష్టమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమన్నారు.

వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయదుర్గం : ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా విప్ కాలవ శ్రీనివాసులు, సతీమణి విజయలక్ష్మి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గం అధ్యక్షులు నల్లపూల గాజుల వెంకటేశులు, పాలక మండలి సభ్యులు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంతమార్కెట్‌కు వేలంపాట

కుందుర్పి : మండల కేంద్రంలోని సంత మార్కెట్, సర్కార్ తోపునకు సంబంధించిన వాటిని సర్పంచు ఆధ్వర్యంలో శనివారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో సంత మార్కెట్ రూ.3.13 లక్షలకు బోయ బొమ్మయ్య, సర్కార్ తోపులను రూ.1.21లక్షలకు రామచంద్ర దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మారుతీశ్వర రామమూర్తి, పంచాయతీ కార్యదర్శి యల్లక్క, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


వేలంపాటలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

పామిడి : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం పామిడిలో చోటు చేసుకుంది. సిఐ శివశంకర్‌నాయక్ తెలిపిన కథనం మేరకు.. మతిస్థిమితం లేని ఓ వ్యక్తి శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారి 44లో ఉన్న శ్రీనిధి డాబా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే సీఐ నెం.94407 96827ను సంప్రదించాలని కోరారు.


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

రేషన్ బియ్యం పట్టివేత

పుట్లూరు : మండలంలోని నారాయణరెడ్డిపల్లి క్రాస్ వద్ద ఆటోలో తరలిస్తున్న పది బస్తాల బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. యల్లనూరు మండలం గొడ్డుమర్రికి చెందిన కేదర్ నాగన్న పది రోజుల నుంచి పుట్లూరు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. సేకరించిన బియ్యాన్ని ముదిగుబ్బకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.


పట్టుబడిన బియ్యం ఆటో